హక్కు మనకు లేదు. ఎందుకంటే, అవతలివారి పరిస్థితుల్లో అది లోపం కాకపోవచ్చు. జీవితమంటే కలలుగనే ఏ స్త్రీ ఆత్మవిశ్వాసం మీద దెబ్బకొట్టే అర్హత ఏ మగాడు తీసుకోకూడదు. అందుకే నేను ఏ పెళ్ళిచూపులకి వెళ్ళను నాన్నా..అలాగని అమ్మాయిని చూడకుండా పెళ్ళి చేసుకోను. అందుకని... మీరు చెప్పే ప్రతి అమ్మాయిని, ఆమె నడవడికనూ, కుటుంబ పరిస్థితుల్నీ, గమనిస్తాను. నాతో ఆమె ఇమడగలదా అని బేరీజు వేసుకుంటాను. అలాంటి ఒక అమ్మాయి కోసం ఎంతకాలమైనా ఆగుతాను. దీనివల్ల ఎవరికీ ఇబ్బంది లేదు నాన్నా...తలొంచుకుని కూర్చునే పెళ్ళి చూపులకన్నా తనకి తెలియకుండా జరిగే పెళ్ళిచూపులు నయం కదా..ఒక అమ్మాయి ఓకే అనుకుంటే, మీ అంగీకారంతో ఆమె తల్లిదండ్రుల్ని కలిసి, నా గురించి మీ గురించి పూర్తిగా చెప్పి, వీలైతే నా పద్ధతిలోనే వాళ్ళమ్మాయిని నన్ను గమనించేలా ప్రోత్సహించమని చెబుతాను. ఆమెకు నచ్చితేనే పెళ్ళి.."

మనోహర్ మాటలు అక్షర సత్యాలు. సంతలో పశుప్రదర్శనలాంటి ఈ పెళ్ళిచూపుల వ్యవస్థ మారాలంటే, మనోహర్‌లాంటి ఆదర్శవంతులు ముందుకు రావాలి. వారికి తల్లిదండ్రుల ప్రోత్సాహం కావాలి.

ఒక పేరున్న రచయితగా ఒకనాడు ఎన్నో ఆదర్శాలు వల్లించాను. నిజజీవితంలో ఎన్నింటితోనో రాజీపడి బ్రతుకుతున్నాను. ఈనాడు నా బిడ్డ ఆచరించి చూపిస్తున్నాడు. అతడికి చేయూతనివ్వడం ద్వారా ఒకనాటి నా ఓటమిలోంచి బయటపడి, గెలుపువైపు పయనిస్తున్నాను.

**-సి.వి.నరసింహదాసు (కోల్‌కతా)**

# స్థాయి

అది చాలా ఇరుకైన వీధిలా కన్పించింది. ఈమధ్యనే కొన్న కొత్త కారుకి ఎక్కడ గీతలు పడతాయేమోనన్న భయంతో ఇంజన్ ఆఫ్ చేసి కార్లోంచి దిగాను. జేబులో ఉన్న అడ్రస్ పేపరు తీసి, మడత విప్పి మరోసారి చూశాను. వీధి పేరైతే కరెక్టుగానే ఉంది. లోపల ఏమైనా సందులున్నాయేమోననుకుని, కారు లాక్ చేసి, కొంచెం ముందుకెళ్ళి, బంకు దగ్గర విచారించాను.

"బాబూ! ఈ వీధిలో వేణుగోపాలావని..."

నా మాట పూర్తికాకముందే బంకులో ఉన్నతను కొంచెం ముందుకు వంగి "అదుగో! ఆయనే వస్తున్నారండి" అన్నాడు.

అవును...అతను వేణుగోపాలే...కానీ.. ఆ లోపలే వేణుగోపాల్ నన్ను చూసి ఆశ్చర్యపోతూ గబగబా నా దగ్గరకొచ్చి, నన్ను గట్టిగా కౌగలించుకున్నంత పని చేశాడు.

"నా కళ్ళింకా నమ్మడం లేదు. కలా? నిజమా? ఎన్నాళ్ళయ్యిందిరా నిన్ను చూసి రమేష్! రా మా ఇంటికెళ్దాం" మరోమాటకు తావివ్వకుండా నా భుజం మీద చెయ్యేసి నడక ప్రారంభించాడు వేణుగోపాల్.

ముందు చిన్న సిటౌట్. మధ్యగది..దాని తర్వాత చిన్న కిచెన్. మూడూ వరుసగా ఉన్నాయి. మసిపట్టి ఉన్న ఓ ప్లాస్టిక్ కుర్చీ వేసి నన్ను కూచోబెట్టాడు.

పోర్టబుల్ బ్లాకండ్ వైట్ టి.వి.లో క్రికెట్ మాచ్ ఆసక్తిగా చూస్తున్న కుర్రాణ్ణి..నాకు తన రెండో కొడుకుగా పరిచయం చేశాడు వేణుగోపాల్. నాకో నమస్కారం పెట్టి..మళ్ళీ మేచ్‌లో మునిగిపోయాడా పిల్లాడు.

వేణుగోపాల్ భార్యని పిలిచి పరిచయం చేశాడు. ఆమె బక్కపల్చగా రక్తహీనతతో ఉన్న పేషెంట్లా ఉంది. వేణుగోపాల్ లోపలున్న పెద్దకూతుర్ని పిలిచాడు. ఆమె చంకలో రెండేళ్ళ పిల్లాడున్నాడు. అల్లుడు ప్రైవేటు కంపెనీలో పన్జేస్తున్నట్టూ చెప్పాడు.

నేను తీసుకెళ్ళిన స్వీట్ పాకెట్ వాళ్ళకిస్తుంటే..వాళ్ళ మొహాల్లో ఏదో కుతూహలం, ఆశ్చర్యం.

వేణుగోపాల్ భార్య ప్లేటులో రెండు లడ్లూ, కాస్తంత మిక్చరూ తెచ్చి నా ముందుంచుతూ...

"ఇవ్వాళ మా మనవడి బర్త్‌డే...తీసుకోండి" అంది.

"అలాగా!" అని వేణుగోపాల్ మనవడికి "హేపీబర్త్‌డే" చెప్పి, వాడి చేతిలో వందరూపాయల నోటుంచాను.

"ఏమిటిదంతా రమేష్! డబ్బులెందుకు?" నొచ్చుకున్నాడు వేణుగోపాల్.

"ఫరవాలేదులే వేణూ! నేనివ్వగూడదా!"

వేణుగోపాల్ ప్రస్తుతం ప్రైవేటు కంపెనీలో క్లర్కుగా చేస్తున్నాట్ట. నేను బాంకులో ఆఫీసరుగా ఇటీవలే ప్రమోషన్ అందుకున్న సంగతి చెప్పేసరికి వేణుగోపాల్ ఆనందపడిపోతూ అలనాటి మా కాలేజీ రోజుల్ని గుర్తుచేస్తుంటే..ఓ గంట కాలక్షేపం అయింది. వాచ్ వంక చూసుకుని, లేస్తూ- "వెళ్ళొస్తానురా!" అన్నాను.

"భోంచేసి వెళ్ళొచ్చు గదరా" అన్నాడు వేణుగోపాల్.

"ఫరవాలేదు. నేను ఓ మీటింగ్‌కెళ్ళాలి. మళ్ళీ కలుద్దాం" అన్చెప్పి, బయల్దేరుతుంటే..నాతో కారు వరకూ వచ్చిన వేణు...

"రమేష్! మన బ్యాచ్‌లో ఇంకో వేణుగోపాల్ ఉండేవాడు. గుర్తుందా! అదేరా! స్పోర్ట్స్ బాగా ఆడేవాడు. వాణ్ణి మనమంతా 'స్పోర్ట్స్ వేణుగోపాల్' అని పిల్చేవాళ్ళం.."

"ఆ..అవునవును" అన్నాను గుర్తు తెచ్చుకుంటున్నట్టు మొహం పెట్టి.

"అతనూ ఇక్కడే రెండు వీధులవతల మూడో వీధిలో ఉంటున్నాడు. కారు, పెద్ద బంగళా, గ్రానైట్ బిజినెస్సట. రెండు ఫ్యాక్టరీలు ఉన్నాయట. ఎన్నోసార్లు బజార్లో కన్పిస్తూనే ఉంటాడు. ఏనాడూ పలకరించలేదు. నేనే ఓ రోజు మాట్లాడి, నేనీ వీధిలో ఉంటున్నట్టు చెప్పాను..'అలాగా' అన్నాడంతే. అదే నువ్వు చూడు...ఈ పాత స్నేహితుణ్ణి మర్చిపోకుండా నన్ను చూడాలని వెతుక్కుంటూ వచ్చినందుకు థ్యాంక్స్‌రా! రమేష్" అన్నాడు వేణుగోపాల్ చెమర్చిన కళ్ళతో నా చేతులు పుచ్చుకుంటూ.



కారు స్టార్టు చెయ్యబోతూ, నాలుక చివరి వరకూ వచ్చిన మాట నోరు జారకముందే..మాట మార్చి-

"ఇందులో ఏముందిలేరా! వేణూ..టైమైంది..మళ్ళీ కలుస్తాను" అని కారు ముందుకు పోనిస్తూ..

నిజానికి నేను వెతుక్కుంటూ వచ్చింది మూడో వీధిలో ఉన్న స్పోర్ట్స్ వేణుగోపాలాన్ని కలవడానికే. అడ్రస్ సరిగ్గా కనుక్కోలేక, ఈ వీధికొచ్చి అనుకోకుండా అప్పటి క్లాస్‌మేటైన ఈ వేణుగోపాలాన్ని కలవటం జరిగిందని అతనికి చెప్పకపోవటం మంచిదైందని, కారుని విశాలంగా ఉన్న మూడో వీధిలోకి తిప్పి, స్పోర్ట్స్ వేణుగోపాలింటి ముందు ఆపాను..మా బ్యాంకు డిపాజిట్ల విషయమై అతన్ని కలిసేందుకు..వచ్చిన నేను.

**-ఎం.వెంకటేశ్వరరావు (సికిందరాబాద్)**